

# అమెరి'కలకలం' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



# హ్యూస్టన్ లో ఉత్తర అమెరికా కథ స్వర్ణోత్సవాలు కాస్త సరదాగా, నిర్విఘ్నంగానే

ఉత్తర అమెరికా ఖండం నుండి మొట్టమొదటి తెలుగు కథ 1964 లో అప్పటి ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురించబడి యాభై సంవత్సరాలు గడిచిన సందర్భంగా, ఉత్తర అమెరికాలో తెలుగు సాహిత్య ప్రారంభానికి అదే తొలి అడుగుగా గుర్తిస్తూ ఉత్తర అమెరికా తెలుగు కథ స్వర్ణోత్సవాలు ప్రధాన అంశంగా హ్యూస్టన్ మహా నగరంలో అక్టోబర్ 25 –26, 2014 తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహించబడిన "తొమ్మిదవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు" దిగ్విజయంగా ముగిసింది. "అమెరికా తెలుగు కథ స్వర్ణోత్సవాలు జరుగుతున్న ఈ రోజు తెలుగు సాహిత్య చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుంది. అందులో నా పేరు, ఇవాళ ఈ సభకి వచ్చిన వారి పేర్లు ఖచ్చితంగా ఉంటాయి" అని డా. యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ గారు సంబరంగా ప్రకటించ గానే "అమ్మయ్య" అనుకున్నాను. ఎటొచ్చీ నా పేరు అప్పుడు అప్పటి తెలుగులో ఖూనీ చేస్తారో, మరే సంకర భాషలో కుదిస్తారో ఆయన చెప్పలేకపోయారు.




ఈ సదస్సులో నేను చెప్పదలచుకున్న విషయం ముందు కొంతా, ఆఖర్న మరి కొంతా చెప్పేశాను. లక్కీగా ఎవరికీ అది అర్థం అయినట్టు లేదు. ఎందుకంటే ఆ రెండు రోజులలోనూ, ఆ తరవాతా ఆ విషయాలు ఎవరూ మాట్లాడ లేదు సరి కదా, నేను కనపడగానే తప్పించుకు తిరిగారు. "పాపం, ఎవరి పిచ్చి వారిది" అని వాళ్ళలో వాళ్ళు అనుకోడం కూడా నా చెవిని బడి భలే సంతోషం వేసింది. ఏదో ఒక విషయం మీద "పిచ్చి ప్రేమ" ఉంటే తప్ప ఏమీ సాధించలేం కదా! చాలా సార్లు అది ఉంటేనే కొంతైనా సాధించగలం కదా!

ఈ సభలకి ఇద్దరు సినీ రచయితలని ఆహ్వానించినా వాళ్ళు యధాప్రకారం "ఆడువారి మాటలకు అర్థాలు" లాగా "గేరంటీగా వస్తాం" అని చెప్పి, చెప్పకుండా రావడం మానేసి, ఈ మహా సభలని ఎంతో విజయవంతం చేశారు. మాకు డబ్బులు మిగిల్చినందుకు, వాళ్ళ చుట్టూ తిరిగే వాళ్ళు ఇక మిగిలిన వాళ్ళలో అంత గ్లేమర్ ఉన్న వాడిని నేనొక్కడినే కాబట్టి అన్ని పొగడ్తలూ నాకే దక్కించినందుకూ ఆ సినిమా వారికి నా ధన్యవాదాలు. ఆ పొగడ్తలు వినలేక, అప్పటికే నా నెత్తిని ఉన్న కొన్ని కొమ్ములు పోలోమని ఇంకా

పిల్లల్ని పెట్టడం భరించలేకా మా క్వీన్ విక్టోరియా వక్తలతో మొత్తుకోడం కళ్ళారా చూశాను. “ఎప్పుడూ లేనిది, ఈ సారి సరదాగా మా హస్బెండు నిర్వహిస్తున్న సాహిత్య సభకి వెడితే ఇంత శిక్షా, బాబోయ్ “ అని ఇంటికెళ్లగానే మా దేవుడి గదిలో దీపం వెలిగించి ఆవిడ ఆ అర్ధరాత్రి వాపోవడం కూడా గమనించాను. ఈ సదస్సు కోసం ఆవిడ శలవు పెట్టడం వలన అర్ధ రాత్రి వర్క్ కి వెళ్ళవలసిన అవసరమూ, తద్వారా నాకు టెంకిజెల్ల తిను అగత్యమూ తప్పాయి. అందుకు పాఠకులలో ఎవరికైనా అసౌకర్యం కలిగితే మన్నించాలి.




ఈ సదస్సును అమెరికాలో భారతదేశ కాన్సల్ జనరల్ గౌ. పి. హరీష్ ప్రారంభించగా, ఆహ్వానిత అతిథులుగా వచ్చిన ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి (గుంటూరు దళిత విశ్వ విద్యాలయ ఉప కులపతి) తన ఆధ్వర్యంలో అమెరికా తెలుగు కథ పై నాగార్జున యూనివర్సిటీ లో అమెరికా తెలుగు కథ మీద తన్నీరు కళ్యాణ్ కుమార్ చేసిన డాక్టరేట్ పట్టా నాకు అంకితం ఇచ్చిన విషయం ప్రస్తావించి, ఈ సదస్సు ప్రధానాంశం అయిన అమెరికా తెలుగు కథ యాభై ఏళ్ల ప్రస్థానంపై ఎంతో విశిష్టమైన కీలకోపన్యాసం చేశారు. తరువాత జరిగిన “సదస్సు అంకిత సభ” లో ఉత్తర అమెరికాలో తెలుగు సాహిత్యం ఆవిర్భవించిన 1964 నుండి 1974 వరకూ వెలువడిన మొట్టమొదటి తెలుగు కథ, పత్రికల కాపీలని తెరపై ప్రదర్శించి తొలి దశకం చరిత్రను సమీక్షించి ఉత్తర అమెరికా తొలి కథకులు స్వర్గీయ పులిగండ్ల మల్లికార్జున రావు గారి కుటుంబాన్ని (ఎడ్మంటన్ (కెనడా), అమెరికా తొలి కవి & తొలి తెలుగు పత్రిక సంస్థాపకులు స్వర్గీయ పెమ్మరాజు వేణుగోపాల రావు గారి కుటుంబాన్ని (అట్లాంటా & పోర్ట్ లాండ్) ఘనంగా సత్కరించారు. ఈ సబ్జెక్టు ఇంకెవరికీ తెలియక, ఆసక్తి లేక, ఈ “అంకిత సభ” ని నేనే నిర్వహించి, “ఇంతకంటే తెలుగు రాదా, వెధవాయ్?” అని తెలుగు మేష్టారి చేత చివాట్లు తింటున్న తెలుగు విద్యార్థిలా ఆ చరిత్ర పరీక్ష బొటాబొటీగా పాస్ అయ్యాను. 94 ఏళ్ల వయసులో సుప్రసిద్ధ జానపద గాయని “కళా ప్రపూర్ణ” డా. అనసూయా దేవి గారు సభాధ్యక్షులుగా ఆశీస్సులు అందించగా ఈ ప్రారంభ సభా కార్యక్రమాన్ని వంగూరి చిట్టెన్ రాజు తన సహజసిద్ధమైన హాస్య చతురతతో సమర్ధవంతంగా నిర్వహించారు అని పేపర్లలో వ్రాశారు అని నేనే అందరికీ రాసేసి పంపించగా వాళ్ళు నిజమే అనుకుని వేసేసుకున్నారు. పత్రికల సంపాదకులు అమాయకులు సుమా అని మరొక సారి ఋజువు అయింది.

ఇక ఈ సదస్సులో డా. యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ నూతన రచన “నరేంద్ర మోదీ – ఒక పరిచయం”, ఆచార్య కృపాచారి నూతన ప్రచురణ “ప్రాణహిత” కథా సంపుటి, వంగూరి ఫౌండేషన్ ప్రత్యేక ప్రచురణలు అయిన అమెరికా కథా సాహిత్యం – ఒక సమగ్ర పరిశీలన (రచయితలు వంగూరి చిట్టెన్ రాజు & తన్నీరు కళ్యాణ్ కుమార్), అమెరికా తెలుగు కథానిక –12వ సంకలనం (సంపాదకులు శాయి

రాచకొండ & వం.చి.రా), పెమ్మరాజు వేణుగోపాలరావు కవితా సమాహారం "ఆత్మార్పణ" (సంపాదకులు విన్నకోట రవిశంకర్), కోసూరి ఉమా భారతి నవల "ఎగిరే పావురమా", అపర్ణ మునుకుట్ల గునుపూడి కథాసంపుటి "ఘర్షణ", & ఉమా పోచంపల్లి గారి "A few poems from my heart" గ్రంధాలు టేపుతో అతికించి రంగు కాగితాలతో పాకింగ్ చెయ్యబడి ఏ ఒక్క పుస్తకం అట్ట కూడా చిరిగిపోకుండా ఆవిష్కరించబడ్డాయి. యధాప్రకారం ఆయా రచయితలూ, సంపాదకులూ తమ జీవితాలలో కొన్ని పొరపాట్లు ఏ విధంగా దొర్లుతాయో వివరిస్తూ ఆ గ్రంధాలు ఎందుకు వ్రాయవలసి వచ్చిందో సభికులకి తెలియజేసి, హృదయ భారాన్ని కాస్త తగ్గించుకున్నారు.




మొదటి రోజు కార్యక్రమాలకి పరాకాష్టగా అమెరికా తొలి కథకులు శ్రీమతి చెరుకూరి రమాదేవి, డా. వేమూరి వేంకటేశ్వర రావు, హైదరాబాద్ నుంచి వచ్చిన డా. ముక్తేవి భారతి గారికి జీవిత కాల పురస్కార మహాసభ ఎంతో వైభవంగా జరిగింది. అందులో భాగంగా అందరికీ శాలువాలు కప్పి, పెళ్ళిళ్ళలో వేసే కర్పూర దండల లాంటివి...అనగా వాసన లేని ప్లాస్టిక్ దండలు వేసి, టోపీలు పెట్టారు. ఎందుకంటే ఇండియా నుంచి అవి తెప్పించినప్పుడు నేను అడిగినవి కిరీటాలు అయితే ఎందుకో అవి ఇక్కడికి అమెరికా వచ్చుటప్పటికి ముఖమల్ టోపీలు గా మారిపోయాయి. ఏది ఏమైనా ఆ జీవిత కాల పురస్కార గ్రహీతలు తమ సుదీర్ఘ జీవితాలలో ఎన్నో టోపీలు పెట్టించుకున్నా, ఇలా తళ, తళా మెరిసే కుచ్చు టోపీలు పెట్టించుకొనుట ఇదే మొదటి సారి అని వారి సంబరం చూసి నాకు అర్థం అయిపోయింది.

తదనంతరం స్థానిక "స్వర మాధురి" చిన్నారులు లాస్య ధూళిపాళ, అలకనంద నూతలపాటి చక్కటి సంగీత విభావరి తో అందరినీ అలరించారు. నేను కూడా పాడడానికి నిర్వాహకులైన సత్యభామ పప్పు, రామ్ చెరువు, తదితరులు చస్తే ఒప్పుకోకపోవడం వారి విజ్ఞతకి నిదర్శనం అని కొంత మంది వ్యాఖ్యానించినా, ఎందుకో సభికులు ఒక మంచి అవకాశాన్ని కోల్పోయారు అని నాకు అనిపించింది. "మా ఆయనా? "పాటా, మతి లేక పోతే సరి" అని ఆ మా క్వీన్ విక్టోరియాయే ఆ నిర్వాహకుల వ్యతిరేక నిర్ణయానికి బాధ్యురాలు అని తరువాత రహస్యవర్గాల ద్వారా తెలిసింది.

ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం ఆరు గంటల దాకా జరిగిన ఈ రెండు రోజుల అద్వితీయ సాహితీ సదస్సులో శాయి రాచకొండ, చిలుకూరి సత్యదేవ్, మధు పెమ్మరాజు తదితరులు నిర్వహించిన ఆరు సాహిత్య ప్రసంగ వేదికలలో భారతదేశం నుంచి వచ్చిన ముక్తేవి భారతి (సమకాలీన తెలుగు కథ పోకడలు) , పాపినేని శివశంకర్ (తెలుగు కథ, కవితల ఆవిర్భావం, చరిత్ర), ఆచార్య కృపాచారి (గిరిజనుల దైనందిన జీవితంలో సాహిత్యం), ఆకెళ్ళ రాఘవేంద్ర (సాహిత్యం ఎందుకు చదవాలి?), జి. భగీరథ (కృష్ణ దేవరాయల సాహిత్య సేవ), ఆస్ట్రేలియా నుంచి వచ్చిన సారధి మోటమర్రి (ఆస్ట్రేలియాలో తెలుగు సాహిత్యం) సముచితమైన ప్రసంగాలు చేశారు.




అమెరికాలో వివిధ నగరాల నుంచి వచ్చిన ఆహ్వానిత సాహితీవేత్తలు గత యాభై ఏళ్ల అమెరికా తెలుగు కథ, కవితలపై విశ్లేషణలు (విన్నకోట రవిశంకర్, ఎస్. నారాయణస్వామి, గొర్తి బ్రహ్మానందం, కల్పన రెంటాల, చంద్ర కన్నెగంటి, అఫ్సర్), మీద పాపినేని శివ శంకర్, తమ అమెరికా సాహితీ ప్రస్థానం పై తొలి కథకులు చెరుకూరి రమాదేవి, వేమూరి వేంకటేశ్వర రావు, డిటెక్టివ్ సాహిత్యం లో కొమ్మూరి గారి ప్రభావం, ఆయన జీవిత విశేషాలతో కిరణ్ ప్రభ, సాహిత్య పోషణలో షికాగో ప్రాంత వాసుల పాత్ర పై యడవల్లి రమణ మూర్తి, శొంఠి శారదా పూర్ణ, నామిని రచనల మీద బాసబత్తిన మొదలైన వారు సాధికారంగా అత్యంత ఆసక్తికరమైన ప్రసంగాలు చేయగా ఫ్రాన్స్ నుంచి వచ్చిన డేనియల్ నేజేర్స్ అచ్చ తెలుగులో మాట్లాడి ఏకైక తెల్లవాడిగా ప్రత్యేక ఆకర్షణ గా నిలిచారు., స్వీయ రచనా విభాగంలో యువకవి శరత్ సూరంపూడి కవితలు అందరినీ ఆకట్టుకున్నాయి.

"తెలుగు భాష –ప్రపంచ భాష " అనే అంశంపై ఎంతో కీలకమైన చర్చావేదికలో ఎంతో మంది తమ విలువైన అభిప్రాయాలని వెలిబుచ్చారు. మనో ధైర్యం, నిబ్బరం, కంప్యూటరు, ఇంటర్ నెట్ ఉన్న వాళ్ళు గూగుల్ లో కానీ, యు ట్యూబ్ లో కానీ ఇంగ్లీషులో "9వ సదస్సు" అని కొడితే చాలు...మీ పంట పండినట్టే. అది తెలుగులో కొడితే కొంప మిలిగినట్టే. ఉదాహరణకి ప్రారంభ సభ ఈ క్రింది లంకె లో చూడవచ్చును. అందులో ఇద్దరు కందువాలలో ఒక కందువా నాది.

ప్రారంభ సభ: https://www.youtube.com/watch?v=uBsgzHuxKuE

పుస్తకావిష్కరణ కార్యక్రమాలు https://www.youtube.com/watch?v=RspmlCHWO5M

అలాగే ఫోటోలు ఈ క్రింది లంకెల లో చూడవచ్చును.

మొదటి రోజు: –

https://plus.google.com/u/2/photos/106849813894171365803/albums/6075831389590875473

రెండవ రోజు: https://plus.google.com/u/2/photos/106849813894171365803/albums/6075829969533972625

టీవీ 9 వారు, టీవీ 5 వారు కూడా ఈ సదస్సుని గుర్తించి వార్తాప్రసారం చెయ్యడం ముదావహం. ఆ లంకె ఈ క్రింద ఇచ్చాం. ఈ ప్రసారాలని ఏర్పాటు చేసిన ఆత్మీయుడు, హ్యూస్టన్ విలేఖరి దామోదర్ రెడ్డికి మా ధన్యవాదాలు.

TV5 link: http://youtu.be/qeZoyMiqfrI

TV9 link: http://youtu.be/Iedq_Yr7Lm4

ఇవేమీ చూడడానికి అంత తీరు బడి లేని వాళ్ళ కోసం కొన్ని ఫోటోలు ఇందుతో జతపరిచాం. సదస్సు రెండు రోజులూ ఎక్కడి వాడు అక్కడే

తిష్ట వేసుకుని, సవ్యసాచిలా ఒక చేత్తో విడియో, మరో చేత్తో ఫోటోలు తీసి, రాత్రి ఇంటికెళ్ళి అన్నీ కంప్యూటర్ లోకి, ఇంటర్నెట్ లోకి ఎక్కించి ఈ సదస్సుని చరిత్ర పుటల్లో యదాతథంగా నిక్షేపితం చేసిన రఘు ధూళిపాళకి మనందరం ఋణపడి ఉన్నాం.

ఎంతో ఆత్మీయంగా, నిజమైన సాహిత్యాభిలాషతో, తపనతో అమెరికా తెలుగు కథా, సాహిత్యాల స్వర్ణోత్సవాలను జరుపుకుంటూ చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ సదస్సు ప్రధాన నిర్వాహకులుగా అహర్నిశలూ శ్రమించిన శాయి & లలిత రాచకొండ, చిలుకూరి సత్యదేవ్, రామ్మోహన్ చెరువు, శారద ఆకునూరి, సత్యభామ పప్పు, మారుతి రెడ్డి, రవి పొన్నపల్లి, రఘు ధూళిపాళ, నూతలపాటి వెంకటేష్ & జ్యోత్స్న, రాజ్ పసల, సీతారామ్ అయ్యగారి, కృష్ణ కీర్తి, మధు పెమ్మరాజు, కలగా రాజ రాజేశ్వరి, మాలా రావు, శర్మ నూతలపాటి మొదలైన వారు అందరి ప్రశంసలూ అందుకున్నారు. వీళ్ళందరూ నాకు ఎంతో ఆత్మీయులు కాబట్టీ, వాళ్ళని పొగిడే అంత భాషాపటిమ నాకు లేదు కాబట్టీ ఈ వ్యాసం ద్వారా టూకీగా నా ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను.

ఇక నేనూ, తెలుగు సాహిత్యమూ ఒకటే అనే భ్రమలోనే ఎప్పుడూ ఉంటాను కాబట్టి ఎవరైనా నన్ను పొగిడితే తెలుగు సాహిత్యాన్నే పొగిడినట్టుగానూ, నన్ను కోప్పడితే సాహిత్యానికి ఇతరుల చేత ఇంకా ఎక్కువగా సేవ చేయించ లేకపోతున్నాను కాబట్టి నన్ను కోప్పడుతున్నారు అనీ అనుకుంటాను. నేను ఇంత బాగా కవితలు, కథలూ రాస్తాను కాబట్టి తెలుగు సాహిత్యం చాలా అభివృద్ధి చెందింది సుమా అని చాలా మంది అనుకుంటే, సాహిత్యాభివృద్ధికి ప్రస్తుత పరిస్థితులలో ఏం కావాలో అది చెయ్యాలి సుమా అని నేను అనుకుంటూ ఉంటాను.

అందుకే ప్రారంభ సభలో కొంత ప్రస్తావించి, ఆఖరి అంశంగా "తెలుగు ప్రాంతం ప్రస్తుతం రెండు రాష్ట్రాలుగా విడిపోయిన సందర్భంలో అనేక రాజకీయ, ఆర్థిక వత్తిడుల ప్రభావంలో మెరుగుపడడానికి బదులు ఈ రెండు ప్రభుత్వాల నిరాసక్తత, నిర్లక్ష్యం మరింత పెరిగి తెలుగు భాషా, సాహిత్యాలు రెండిటికీ చెద్ద రేవడిలా పూర్తిగా క్షీణించే పెను ప్రమాదం పొంచి ఉంది. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలపై ఉన్నత స్థాయి పరిశోధనలు, ఇతర భాషా శాస్త్రవేత్తలకు తెలుగు భాషాసాహిత్యాలపై శాస్త్రీయ అవగాహన, నూతన సాహిత్యం వెలువడడానికి అనువైన వాతావరణం మొదలైన అత్యవసరమైన, బలమైన పునాదులు విశ్వవిద్యాలయాలలో తెలుగు పరిశోధనా పీఠాలను నెలకొల్పుకుని తెలుగు భాషాసాహిత్యాలను ద్వారా అమెరికాలోనూ, ఇతర దేశాలలోనూ ఉన్న మనమే కాపాడుకోవలిసిన సమయం ఆసన్నమయింది అని ఈ సదస్సు భావిస్తోంది." అనే సదస్సు తీర్మానాన్ని నేను భయపడుతూ ప్రవేశ పెట్టగా ఆ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఆ తరువాత ఎవరి దేశాలకి వాళ్ళు, ఎవరి ఇళ్ళకి వాళ్ళు వెళ్ళి పోయి ఈ పాటికి ఈ తీర్మానం సంగతి మర్చిపోయి ఉంటారు.

అవును, పాపం "ఎవరి పిచ్చి వారిది కదా!". చూద్దాం నా ఈ మాయ రోగం ఎప్పుడు కుదురుతుందో! జై చంద్ర బాబూ, జై, జై చంద్ర శేఖరా.......నా సలహా విని జిల్లాకి కేవలం కోటి రూపాయలు తెలుగు భాషకి, సాహిత్యానికి, సంస్కృతికి, అన్నింటికీ కలిపి కేటాయించండి. అంతే...మళ్ళీ ఈ విషయాలు మీతో మాట్లాడితే ఒట్టు! డబ్బిచ్చి కొనుక్కోవలసిన అవసరం లేకుండానే మీకు ఓట్లు రాలకపోతే ఒట్టు!


Houston Telugu Cultural Association
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా
తొమ్మిదవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు
మరియు

**COMMENTS**